
సాక్షి ఒడిశా

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 5,80,201

వెండి : 52 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్‌/పూరీ

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



న్యూ జల్పాయిగుడి – చెన్నై సెంట్రల్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. - 8లో



విద్యార్థుల భద్రతకు భరోసా

నేపాల్‌ మంత్రికి ముఖ్యమంత్రి అభయమిచ్చారు. విద్యార్థులకు భద్రతకు ఎటువంటి ధోకా ఉండదని హామీ ఇచ్చారు. - 8లో

న్యూస్‌రీల్‌

ట్రక్కును ఢీకొన్న కారు

- ఇద్దరు దుర్మరణం



ప్రమాదంలో నుజ్జయిన కారు

భువనేశ్వర్‌: ట్రక్కుని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ఇన్ఫో వ్యాలీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో నగర శివారు ప్రాంతమైన గంగపడా రోడ్డు పిత్తాపల్లి కూడలి సమీపంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పూరీ చందన్‌పూర్‌ ప్రాంతానికి చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. బరంపురం నుంచి భువనేశ్వర్‌కు వెళ్తుండగా ట్రక్కుని కారును బలంగా ఢీకొనడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. కారులో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. అప్పటికే ఇద్దరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బాధిత వ్యక్తిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఇన్ఫో వ్యాలీ ఠాణా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

21 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన యాదవ్‌

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్‌ సమీపంలో ఒక వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు అతని వద్ద నుంచి 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వ్యక్తి మధ్యప్రదేశ్‌కు చెందిన మహేంద్ర కుమార్‌ యాదవ్‌గా గుర్తించారు. శనివారం ఉదయం స్థానిక అబ్కారీ శాఖ వోఐసీ సంజయ్‌ కుమార్‌ ప్రధాన్‌ నేతృత్వంలో సిబ్బంది మెలక కుమారి, జి.ధర్మారావు, సందీప్‌ కుమార్‌ పాత్రోలో ఎప్పటిలాగే పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న సమయంలో స్థానిక రైల్వే స్టేషన్‌ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన యాదవ్‌కు చెందిన బ్యాగులను తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టుకు తరలించారు.

హత్య కేసులో ఆరుగురికి యావజ్జీవ శిక్ష



జగబంధు చిత్రపటంతో బాధిత కుటుంబీకులు

రాయగడ: ఓ హత్య కేసుకు సంబంధించి ఆరుగురికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ బిసంకటక్‌ ఎస్‌డీజేఎం కోర్టు శనివారం తీర్పునిచ్చింది. జిల్లాలోని బిసంకటక్‌ సమితి సహడ పంచాయతీ కొణ గ్రామానికి చెందిన జగబంధు కొలక అనే యువకుడిని చేతబడి చేస్తున్నాడన్న అనుమానంతో అదే గ్రామానికి చెందిన పది మంది హత్య చేశారు. మృతదేహాన్ని సమీపంలోని అడవిలో తగలబెట్టారు. 2015 డిసెంబరులో జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు బిసంకటక్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు అప్పట్లో పది మందిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో 18 ఏళ్లలోపు వారు ముగ్గురు ఉన్నారు. అప్పట్లోనే ఒకరు మృతి చెందగా.. మిగతా ఆరుగురు టుకుడు కొలక, పురందర్‌ కొలక, గుటియా కొలక, దబి కొలక, దాసి తొయిక, దాసిరాం కొలకలకు యాజజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

వ్యభిచార గృహంపై దాడి

జయపురం: వ్యభిచార గృహంపై దాడి చేసి ఒక మహిళ, ముగ్గురు పురుషులను అరెస్టు చేసినట్లు జయపురం సదర్‌ పోలీసు స్టేషన్‌ అధికారి ఈశ్వర తండి శనివారం విలేకరులకు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఏఎస్‌ఐ పంకజినీ శబర్‌, ఓఏఎస్‌ఐ ఎస్‌.దాస్‌, హవల్దార్‌ పీసీహెచ్‌ మాఝీ, కానిస్టేబుల్‌ బి.ఆర్‌.కినంగ్‌, డ్రైవర్‌ సంతోష్‌ శనాపతితో కలిసి పెట్రోలింగ్‌ జరుపుతుండగా బంగళాబెడ గ్రామంలో ఓ అద్దె ఇంట్లో వ్యభిచారం జరుగుతోందని సమాచారం అందింది. వెంటనే వెళ్లి దాడులు చేయగా మహిళ, మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వస్తువులు సీజ్‌ చేసి కేసు నమోదు చేశారు.

బ్రహ్మోత్సవ వైభవం

- ముగిసిన లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- స్వామివారికి విశేష అభిషేకాలు
- హంస వాహనంలో ఊరేగిన స్వామివారు



చందనంతో స్వామివారికి అభిషేకం



విశేషపూజల్లో భాగంగా పాట్నాలు దంచుతున్న అర్చకులు



హంస వాహనంలో స్వామివారి ఊరేగింపు



స్వామివారికి పాలాభిషేకం

రాయగడ: అమలా భట్ట సమీపంలోని శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌ ప్రాంగణంలో లక్ష్మీనృసింహ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంతో పాటు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు మంగనాథ్‌ ఆచార్యులు, ప్రముఖ వేద పండితులు భాస్కరాచార్యులు పర్యవేక్షణలో ఉత్సవాలు కనులపండువగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శాత్తుమొర్రై, వసంతోత్సవం, చూర్ణోత్సవం, అష్టోత్తర శత, కలశాభిషేకం, చక్రస్నానం వంటి విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం పుణ్యకోటి వాహన సేవ, హంస వాహనంపై స్వామివారి ఊరేగింపు, పుష్పయాగం, నిత్య విశేష హోమాలు, నీరాజనాలు, మంత్రపుష్ప పూజలు జరిగాయి. ఆరు రోజులు జరిగిన ఉత్సవాలను తిలకించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలు సేకరించారు. రాజ్యసభ మాజీ సభ్యులు నెక్కంటి భాస్కరరావు దంపతులు స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆలయ ధర్మకర్త దూడల శ్రీనివాస్‌ నిర్వహించిన సామూహిక వివాహాలకు వచ్చిన దంపతులకు నెక్కంటి ఐదు వేల రూపాయల చొప్పున్న ఆర్థిక సాయం చేశారు.

బ్రహ్మణ సమాజం ఆధ్వర్యంలో సన్మానం

ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఉత్కళ బ్రాహ్మణ సమాజం అధ్యక్షులు రేజీజి శ్రీనివాస్‌ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు భాస్కరాచార్యుల దంపతులను ప్రత్యేకంగా సన్మానించారు. ఆయన ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా జరిగాయని కొనియాడుతూ ప్రశంసా పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సమాజం సభ్యులు భళ్లమూడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



స్వామి కంకణాన్ని ధరిస్తున్న నెక్కంటి దంపతులు



భాస్కరాచార్యులను సత్కరిస్తున్న దృశ్యం



హోమం చేస్తూ..



ఉత్సవమూర్తికి వేదపండితుల విశేష పూజలు

బాలికలు ఆరోగ్యంపై దృష్టిసారించాలి

మల్కన్‌గిరి: కిశోరీ బాలికలు ఆరోగ్యంపై దృష్టిసారించాలని సంబంధిత అధికారులు అన్నారు. మలకన్‌గిరి జిల్లా మత్తిలి సమితి మేండాకులి పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పంచాయతీ స్థాయి కిశోరీ మేళాను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్‌ అధికారి గాంగి సిరగాం బాలికలు ఎదుర్కొనే సమస్యలు.. పరిష్కారంపై అవగాహన కల్పించారు. పది నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు రక్తహీనత, శారీరకమార్పులు సహజమన్నారు. అయితే చాలామంది వీటితో ఆందోళన చెందుతూ చదువును మధ్యలోనే మానేస్తున్నారన్నారు. కొంత మంది బాల్య వివాహాలు చేసుకుంటూ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారన్నారు. అనంతరం కిశోరీ బాలికల మధ్య ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సమితి సమన్వయకర్త సౌమ్యా శుభమ్‌ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

పెనుగాలుల బీభత్సం

- బోయిపరిగుడ ప్రాంతంలో నేలకూలిన చెట్లు



రోడ్డుపై పడిన వృక్షాన్ని తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌ బోయిపరిగుడ సమితిలో రెండు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. పెనుగాలులు బీభత్సం సృష్టిస్తుండడంతో భారీ చెట్లు నేలకొరిగాయి. రోడ్లకు అడ్డంగా చెట్లు కూలడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో గాలివానతో బోయిపరిగుడ సమితి కాటపడ పంచాయతీ తాలపాదర రస్తాలో పెద్ద వృక్షం నేలకూలి రోడ్డుపై పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా కాటపడ, కొల్లార్‌ పంచాయతీ గ్రామాల ప్రజలు రహదారి సంబంధాలకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు బోయిపరిగుడ అగ్నిమాపక విభాగ అధికారులు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును ముక్కలుగా కోసి తొలగించటంతో రాకపోకలకు అవరోధం తొలగింది.

చిరు ధాన్యాల నుంచి మద్యం!

- గిరిజన రైతులకు లాభం.. ప్రభుత్వ ఖజానాకు ఆదాయం
- రాష్ట్ర ప్రభుత్వం యోచన



సంప్రదాయ తృణధాన్యాల మద్యం

భువనేశ్వర్‌: చిరుధాన్యాల నుంచి మద్యం తయారీని ప్రోత్సహించి తద్వారా గిరిజన రైతులకు లాభం చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వ ఖజానాకు సైతం ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనికి సంబంధించి ఉన్నత స్థాయి అనుబంధ వర్గాలతో రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీరాజ్‌ హరిచందన్‌ ప్రాథమికంగా చర్చించారు. భవిష్యత్తులో మరిన్ని చర్చలు జరుగుతాయని తెలిపారు. కొత్త విధానం రాష్ట్రంలో మహువా మద్యం, అబ్కారీ ఆదాయాలను కూడా పెంచుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

- గిరిజన వర్గాలకు వ్యవసాయ అవకాశాలను బలోపేతం చేయడానికి ప్రగతిశీల చర్యలో భాగంగా తృణధాన్యాల నుంచి మద్యం తయారీ ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను ఆవిష్కరించింది. అబ్కారీ, పరిశ్రమల శాఖలు ఈ యోచన సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నాయి.
- 2025–26 సంవత్సరానికి అబ్కారీ విధానంపై అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీరాజ్‌ హరిచందన్‌ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. సమీప భవిష్యత్తులో పరిశ్రమల శాఖతో కొత్త యోచన వాస్తవ కార్యాచరణ సాధ్యాసాధ్యాలపై చర్చలు జరపనున్నారు.
- అనేక కంపెనీలు చిరుధాన్యాలు, బార్లీ, బజ్రా వంటి ఆహార ధాన్యాలను ఉపయోగించి మద్యం (ఆల్కహాల్‌) ఉత్పత్తి చేయడానికి ఆసక్తిని వ్యక్తం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ మహువా మద్యాన్ని మెరుగుపరచడానికి సన్నాహాలు చేస్తోంది. వివిధ రకాల రుచులతో శుద్ధి చేసిన మిశ్రమాలతో ఈ మద్యాన్ని అభివృద్ధి చేసేందుకు అబ్కారీ శాఖ నడుం బిగించింది.
- మహువా పువ్వులకు గిరాకీ పెంపొందించి గిట్టుబాటు ధర కల్పించేందుకు ఈ సన్నాహాలు దోహదపడతాయని భావిస్తున్నారు. ఈ చర్య గిరిజనులకు లాభసాటిగా ఉంటుంది. ప్రస్తుత సంప్రదాయ మద్య పానీయాల కంటే ఉన్నత ప్రమాణాల మద్య పానీయాల ఉత్పత్తి సాధ్యాసాధ్యాల్ని లోతుగా పరిశీలిస్తున్నారు. ఈ మేరకు ప్రణాళికలు, కార్యాచరణ ప్రక్రియ తుది మెరుగులు దిద్దుకుంటుందని అబ్కారీ శాఖ కమిషనర్‌ నరసింఘ భోల్‌ మీడియా ప్రతినిధులకు తెలిపారు.
- ఈ చొరవ గిరిజనులకు ప్రయోజనం చేకూర్చి ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు సహాయపడుతుంది. చిరు ధాన్యాల ఆధారిత (ఫింగర్‌ మిల్లెట్‌, పెర్ల్‌ మిల్లెట్‌ మొదలైనవి) మద్యం ఉత్పత్తి చేయడానికి మద్యం పరిశ్రమలను ఏర్పాటు చేయడంలో ఇబ్బందులను తొలగించి వ్యవస్థ సరళీకృతం చేసేందుకు అబ్కారీ విభాగం చురుగ్గా సన్నాహాలు చేస్తోంది.
- అబ్కారీ విధానం 2024–25 ప్రకారం అవుట్‌ స్టిల్‌ షాపులకు ఉన్న సి–మనీలో 1.5 శాతం పెరుగుదల, డిస్టిలరీల ఉత్పత్తి సామర్థ్యం ఆధారంగా వేర్వేరు రుసుములతో టైర్డ్‌ లైసెన్సింగ్‌ ఫీజు విధానం ప్రవేశపెట్టారు. అదనపు రౌండింగ్‌–ఆఫ్‌ ఎక్సైజ్‌ డ్యూటీ (ఏఆర్‌ఓఈడీ) పర్మిట్‌ జారీ సమయంలో అల్గోరిథమిక్‌ ధర సర్దుబాట్ల ద్వారా గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) ప్రామాణీకరణను రూ.10 గుణకాలకు నిర్ధారించి ధర నియంత్రణకు పటిష్ఠమైన ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్‌ వివరించారు. ఈ చర్యలు 2023–24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈఎన్‌ఏ– ఆధారిత దేశీయ మద్యం ఉత్పత్తిని పర్యవేక్షణతో రాష్ట్ర అబ్కారీ విభాగం ఆదాయాన్ని 18 శాతం పెంచవచ్చని అంచనా వేశారు. సమగ్ర మద్యం అమ్మకాలలో దేశీయ మద్యం 42 శాతం వాటా కలిగి ఉంది.

సామాజిక బాధ్యత విధానాలు..

తృణ ధాన్యాల మద్యం విక్రయ దుకాణాల నిర్వహణకు సాధారణ మద్యం దుకాణాల నియమ నిబంధనల్ని కట్టుదిట్టంగా వర్తింపజేస్తారు. విద్య, మతపరమైన సంస్థల ప్రాంతాల్లో 150 మీటర్ల పరిధిలో బఫర్‌ జోన్‌ను తప్పనిసరి చేస్తారు. పట్టణ ప్రాంతాల్లో అబ్కారీ కమిషనర్‌ ఆమోదంతో 75 మీటర్ల వరకు సడలింపు సాధ్యమయ్యే అవకాశం కల్పించారు. కొత్త అవగాహన కార్యక్రమాలలో అన్ని ఆన్‌ దుకాణాలలో తప్పనిసరి 'బాధ్యతాయుత వినియోగం' సంకేతాల ప్రదర్శన, వ్యసనం నుంచి విముక్తి పొందేలా చేయడంలో పని చేస్తున్న కేంద్రాలకు 2 శాతం ఆదాయం కేటాయిస్తారు. కొత్తగా చిరు ధాన్యాల ఆధారిత మద్యం విక్రయంతో మునుపటి సంవత్సరాల కంటే 3 రెట్లు అధికంగా ఆర్థిక వనరులు మెరుగుపడే అవకాశం పట్ల పరిశీలన కొనసాగుతుంది. కాగా, చిరు ధాన్యాల మద్యాన్ని తక్కువ ధరకు విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది.

పైపుల చోరీ కేసులో పది మంది అరెస్టు

- ఆరు వాహనాలు, రూ. 56 లక్షల విలువైన పైపులు స్వాధీనం



పట్టుబడిన నిందితులతో పోలీసు అధికారులు



స్వాధీనం చేసుకున్న పైపులు



సీజ్‌ చేసిన వాహనాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి పోట్రేల్‌ పంచాయతీ టేక్‌గూడ సమీపంలో ఉన్న మేగా జల ప్రాజెక్టు చెందిన పైపులను చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో పది మందిని అరెస్టు చేయడంతోపాటు వారి వద్ద నుంచి 102 పైపులు, వాటిని తరలించేందుకు వినియోగించిన ఆరు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.బలిమెల ఐఐసీ ధీరాజ్‌ పట్నాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. రైతులకు సాగు నీరు అందించేందుకు వీలుగా మెగా జల ప్రాజెక్టు పనులను ప్రభుత్వం ప్రారంభించింది. నీటిని తరలించేందుకు వీలుగా పైపులను టేంతులిగూఢ, ఎంవీ 120 గ్రామం సమీపంలో డక్టైల్‌ ఐరన్‌ పైపులను ప్రాజెక్టు అధికారులు నిల్వ ఉంచారు. ప్రాజెక్టు సిబ్బంది పోడియా, కోరుకొండ సమితుల్లో పనిచేస్తున్నారు. 102 ఐరన్‌ పైపులు ఈ నెల 19వ తేదీన చోరీకి గురైనట్టు సిబ్బంది గుర్తించి 20వ తేదీన బలిమెల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్న పరిశీలించారు. శుక్రవారం రాత్రి ఎంవీ 120 గ్రామం సమీపంలో ఆరు వాహనాల్లో చోరీ చేసిన పైపులను తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్టు గుర్తించామని ఐఐసీ ధీరాజ్‌ పట్నాయక్‌ తెలిపారు. దీంతో 56 లక్షల విలువైన పైపులు, వాటిని తరలించేందుకు వినియోగించిన ఆరు వాహనాలను స్వాధీనం చేసుకొని పది మందిని అరెస్టు చేశామని శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అరెస్టయిన వారిలో మహారాష్ట్రకు చెందిన రమేష్‌ అశోక్‌ యాధవ్‌, బాబాసో సరేశ్‌ మస్టే, నితిన్‌ ప్రకాష్‌ బోసలే, కర్నాటకకు చెందిన ఎస్‌.సూర్యకుమార్‌, మధ్యప్రదేశ్‌కు చెందిన మహ్మద్‌ హనీఫ్‌ ఖాన్‌, త్రిపాల్‌ ఠాకూర్‌, ఒడిశాకు చెందిన ఇంద్ర ప్రసాద్‌ పరిజా, అనంత్‌ దాస్‌, హేమాంత్‌ సుందరా, మిథున్‌ బారిక్‌ ఉన్నారన్నారు. వీరిని శనివారం కోర్టులో హాజరు పరిచామన్నారు.

సమతుల్య ఆహారం, వ్యాయామం అవసరం



ఆసనాల గురించి వివరిస్తున్న వైద్యులు డాక్టర్‌ లక్ష్మీనారాయణ సాహు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులు

రాయగడ: ప్రతిఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోవడంతోపాటు నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆయాసంతోపాటు వివిధ రోగాల బారినుంచి కాపాడుకోగలమని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్‌ లక్ష్మీనారాయణ సాహు అన్నారు. స్థానిక సాయిప్రియ వాకర్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్‌ సురేష్‌ కుమార్‌ స్వగృహంలో హృద్రోగంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కోవిడ్‌ అనంతరం హృద్రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఊత్తిడికి లోనవ్వడంతో పాటు ఆహార నియమాలు పాటించకపోవడం, వ్యాయామం చేయకపోవడం వంటి కారణాలతో గుండెపోటు బారిన పడుతున్నారని అన్నారు. ధూమపానం, మద్యపానాలకు దూరంగా ఉండి ఆహార నియమాలను పాటించగలిగితే హృద్రోగాల నుంచి విముక్తి పొందే అవకాశం ఉందని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అందరూ వ్యాధుల బారిన పడుతుండడం పరిపాటిగా మారిందని అన్నారు. ఈ సమస్య నుంచి బయటపడాలంటే వృద్ధులు సైతం వ్యాయామం, ఆసనాలు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సాయిప్రియ వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్షులు కె.ఎస్‌.ఎన్‌.శర్మ, సుభాష్‌ చంద్రబెహర పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల్లో ప్రథమ స్థానంలో నిలవాలి



మాట్లాడుతున్న ఉపాధి పీడీ సుధాకర్‌రావు

జి.సిగడాం: ఉపాధి పనుల్లో రాష్ట్రంలోనే శ్రీకాకుళం జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలని ఉపాధి హామీ పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకర్‌రావు ఆకాంక్షించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె పండగ పనుల కోసం జిల్లాకు రూ.700 కోట్లు వరకు ప్రతిపాదనలు పంపామని తెలియజేశారు. ఇప్పటివరకు రూ.370 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పనులు కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని పేర్కొన్నారు. అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు పనులు చేస్తే రోజుకు రూ.300ల వరకు వేతనం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో చోళ్ల సత్యనారాయణ, టీఏలు ఎస్.లక్ష్మణరావు, వై.వైకుంఠరావు, జె.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు



కుళాయిలు ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని బొంతలకోడూరు గ్రామంలో జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. కొన్ని ఇళ్లకు ఇంకా పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేయలేదు. కానీ గ్రామ పంచాయతీకి సంబంధం లేకుండా కూటమి నాయకులు పంచాయతీ వాటర్ స్కీమ్ నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసి, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కుళాయిలను శనివారం ప్రారంభించారు. దీంతో కోడ్ ఉల్లంఘన, పంచాయతీ అనుమతి లేకుండా కూటమి నాయకులు తీసుకున్న నిర్ణయంపై సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు 27న సెలవు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు ఈ నెల 27న ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రయివేటు యాజమాన్యాలు, సంస్థలు తమ సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

మందసలో చోరీ

కాశీబుగ్గ: మందస మేజర్ పంచాయతీ కొత్తవీధిలో ఉన్న శ్రీసత్యసాయి కమల్ బిల్డింగ్ మెటీరియల్స్ షాప్, గోడౌన్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షాపు ముందరి భాగంలో పక్కనున్న ఇనుప తలుపులు, తాళాలు విరగ్గొట్టి దుండగులు లోపలికి చొరబడ్డారు. అనంతరం షాప్ లోపల ఉన్న సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లు కట్ చేయడంతో పాటు విద్యుత్ బల్బులను తొలగించారు. చోరీలో షాపులో ఉన్న సుమారు రూ.లక్ష నగదు దోచుకెళ్లిపోయినట్లు యజమానులు ఇప్పిలి వేంకటేశ్వరరావు, మద్ది నవీన్ పోలీసులకు ఫిర్యాదు. మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం సీజ్

సరుబుజ్జిలి: అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని శనివారం స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.హైమావతి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో తనిఖీల్లో భాగంగా హిరమండలం మండలం చిన్న కొల్లివలస గ్రామం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో మూడు గోవులు, రెండు దూడలు ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అలాగే వాటిని రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. గోవులు, దూడలను విజయనగరం జిల్లా గుర్ల‌ంగివలస గోశాలకు తరలించినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎటపాక: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం బండిరేవు వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై అప్పలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కన్‌గిరి జిల్లా మోటు పంచాయతీ బినాయక్‌పూర్ గ్రామానికి చెందిన పండా బజారు (38) భద్రాచలంలో పెయింటింగ్ పనిచేస్తున్నాడు. స్వగ్రామం వెళ్లి తిరిగి తన ద్విచక్ర వాహనంపై శనివారం భద్రాచలం బయలుదేరాడు. ఎటపాక మండలం బండిరేవు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం మూలమలుపు వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన బజారు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

విద్యార్థుల భద్రతకు భరోసా

- నేపాల్ మంత్రికి ముఖ్యమంత్రి అభయం
- రాయబార ప్రతినిధులతో భేటీ



నేపాల్ రాయబార ప్రతినిధి బృందంతో చర్చిస్తున్న సీఎం



నేపాల్ విదేశాంగ మంత్రి అర్జురానా దేవుబాతో ఫోన్‌లో మాట్లాడుతున్న సీఎం మాఝి

భువనేశ్వర్: స్థానిక కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ కిట్ క్యాంపస్‌లో నేపాల్‌కు చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర అలజడి రేపింది. క్యాంపస్‌లో అశాంతి వాతావరణం అలముకుంది. మరో వైపు నేపాలు ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ కల్పించుకుని తమ విద్యార్థుల భద్రత పట్ల ఆరా తీస్తోంది. ఈ నేపథ్యంలో నేపాలు రాయబార ప్రతినిధి బృందం రాష్ట్రానికి విచ్చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో స్థానిక లోక్ సేవా భవన్‌లో బృందం భేటీ అయ్యింది. బృందంలో నవీన్ రాజ్ అధికారి, సంజీవ్ శర్మ దాస్ ఉన్నారు. కిట్ క్యాంపస్‌లో నేపాల్ విద్యార్థుల రక్షణ, భద్రతపై చర్చించారు. క్యాంపస్‌లో తలెత్తిన అలజడి, ప్రభుత్వం చేపట్టిన చర్యలను సీఎం వివరించారు. ఈ చర్యల పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నేపాల్ విదేశాంగ మంత్రి అర్జురానా దేవుబాతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

యువ వ్యాపారులకు ప్రోత్సాహం



ఎంపికైన 11 మంది లబ్ధిదారులు

మల్కన్‌గిరి: జిల్లా నైపుణ్య అభివృద్ధి, ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయంలో శనివారం నానో యూనికార్న్ ప్రణాళిక కింద లబ్ధిదారులను ఎంపిక చేసే కార్యక్రమాన్ని జిల్లా నైపుణ్య అభివృద్ధి ఉపాధి అధికారి మనస్వి శేఠి నిర్వహించారు. ఎంపిక ప్రక్రియలో జిల్లా పరిశ్రమల అధికారి, ఐటీఐ ప్రిన్సిపాల్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, జిల్లా సామాజిక భద్రతా అధికారి, శిక్షకులు టాటా స్ట్రైవ్, ప్రతినిధులైన మానస్ కుమార్ సామ్య పాల్గొన్నారు. 11 మంది యువ పారిశ్రామికవేత్తలు వ్యాపారం ప్రారంభించేందుకు ముందుకు వచ్చారన్నారు. భవిష్యత్తులో వీరు ఉద్యోగావకాశాలను సృష్టించగలరని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమం మరింత మంది యువతకు ప్రేరణనిచ్చి కొత్త వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు సహాయపడుతుందని జిల్లా నైపుణ్య అభివృద్ధి ఉపాధి అధికారి తెలిపారు. ఈ సందర్భంగా 30 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు వీరిలో 11 మందిని తుది ఎంపిక చేశారు. వీరికి త్వరలో లక్ష రూపాయలు రుణం సాయం అందించనున్నారు.

ఘనంగా మందిర ప్రతిష్ఠోత్సవం



జయపురం రాజమాత సారికదేవికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి బాగ్దేరిలో గ్రామ దేవత ఠకురాణికి నిర్మించిన నూతన మందిర ప్రతిష్ఠ ఉత్సవంలో జయపురం రాణి, రాజమాత సారికదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె రాకతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామ ప్రజలు ఆమెకు అపూర్వ స్వాగతం పలికారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఠకురాణి మందిర ప్రతిష్ఠ ఉత్సవాల్లో రాజమాత సబితా దేవి ఠకురానికి ప్రథమ భోగం సమర్పించారు. మొదటి రోజు అంకురారోపణ, రెండోజు కలశ జాతర, మూడో రోజు విగ్రహ ప్రతిష్ఠ, ప్రసాద వితరణణ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఠకురాణి మందిర పరిచాలన కమిటీ వెల్లడించింది. గ్రామ పెద్దలు రాధాప్రసాద్ పాత్రో, బినిత శతపతి, హరిహర దామోదర శాస్త్రి పాల్గొన్నారు.కుంద్ర, బొయిపరిగుడ సమితుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

నాగావళి ప్లానిటోరియం పునః ప్రారంభం

రాయగడ: సదరు సమితి బాకురుగుడలో గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.14 కోట్ల వ్యయంతో నాగావళి పేరిట నిర్మించిన ప్లానిటోరియం 2024లో ప్రారంభమై కొద్ది రోజులకే అనివార్య కారణాల వల్ల మూతపడింది. దీనిని శనివారం జిల్లా యంత్రాంగం పునః ప్రారంభించింది. జిల్లా అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్, జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి భజన్‌లాల్ మాఝి తదితరుల పరివేక్షణలో ప్లానిటోరియం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. పెంట గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ ప్లానిటోరియంను సందర్శించారు. విద్యార్థుల కోసం రూ.20, ఇతరులకు రూ.30 టికెట్టును జిల్లా యంత్రాంగం నిర్ధారించింది. ప్రతీ రోజు ఉదయం 11 నుంచి 11.45 గంటల వరకు, మధ్యాహ్నం 12.15 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 2.45 గంటల వరకు ప్రదర్శన వేళలు ఉంటాయని యంత్రాంగం పేర్కొంది.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ నాయక్, మాఝి, తదితరులు



ప్రారంభమైన ప్లానిటోరియం



ప్లానిటోరియంను సందర్శించిన విద్యార్థులు

సెక్యూరిటీ జోన్‌లో..
ఇటుక బట్టీల ధ్వంసం



ఇటుక బట్టీలను జేసీబీతో ధ్వంసం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: జయపురం విమానాశ్రయ సెక్యూరిటీ జోన్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలను అధికారుల సమక్షంలో శుక్రవారం సాయంత్రం జేసీబీతో ధ్వంసం చేశారు. విమానాశ్రయం ప్రహరీకి 30 మీటర్ల దూరంలో ఉన్న 8 ఇటుక బట్టీలను కూల్చివేశారు. ఇటుక బట్టీలను కూల్చి వేస్తున్న విషయం తెలిసిన బట్టీల యజమానులు అధికారులను కలిసి మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. యజమానుల అభ్యర్థనను అధికారులు పట్టించుకోలేదు. అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలను తొలగించాలని బట్టీ యజమానులకు నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదని అధికారులు తెలిపారు. 15 రోజుల కిందట నోటీలు ఇచ్చామన్నారు. ఇటుక బట్టీల వలన వచ్చే పొగ, ధూళి విమానాశ్రయంలో సమస్యలకు కారణం అవుతున్నందున బట్టీలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. జయపురం తహసీల్దార్ సవ్యసాయి జెన, జిల్లా మైనింగ్ అధికారి కృష్ణచంద్ర ఖుంటియ, జయపురం సదర్ పోలీస్ స్టేషన్ అధికారి ఈశ్వర తండి, పొల్యూషన్ విభాగ అధికారి బి.కె.ఖడంగ సమక్షంలో జయపురం అగ్నిమాపక సిబ్బంది ఇటుక బట్టీలను కూల్చి వేశారు. ఇటుక బట్టీలు ధ్వంసం చేయటం వల్ల సుమారు రూ.15 లక్షలు నష్టం కలిగిందని యజమానులు తెలిపారు.

దేవేతి గ్రామంలో ఉద్రిక్తత



ఘర్షణ పడుతున్న పోలీసులు, గ్రామస్తులు

పర్లాకిమిడి: గుసాని సమితి కేరండి పంచాయతీ దేవేతి గ్రామంలో శనివారం ఉద్రిక్తత నెలకొంది. గ్రామస్తులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామంలో కొన్నాళ్లుగా ఒడిశా ఆర్మ్‌డ్ పోలీసుస్టేషన్ సిబ్బంది కోసం క్వార్టర్స్ నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం 12కేవీ విద్యుత్ లైన్ వేస్తున్నామని, ఎస్సీ వీధిలో ఇళ్లను ఖాళీ చేయాలని పోలీసులు కోరగా ఉద్రిక్తత ఏర్పడింది. అనేక సంవత్సరాలు ఇక్కడే నివాసముంటున్న తమను ఖాళీ చేయమని కోరడం భావ్యం కాదని చెప్పారు. విషయం తెలుసుకున్న పర్లాకిమిడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులకు సర్దిచెప్పారు.

తల్లి మందలించిందని..
ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- ఉరివేసుకుని బలవన్మరణం
- కాశీబుగ్గ శివాజీనగర్‌కాలనీలో విషాదం



బుడుమూరు యశ్వంత్‌రాజు(ఫైల్)

కాశీబుగ్గ : 'పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్నాయి.. కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్ద చదవకుండా తిరుగుతున్నావు.. ఇలాగైతే ఎలా?' అంటూ తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం గ్రామం శివాజీనగర్ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుడుమూరు దుర్గారావు దంపతులకు పిల్లలు లేకపోవడంతో యశ్వంత్‌రాజు(16)ను చిన్నతనంలోనే దత్తత తీసుకున్నారు. యశ్వంత్‌రాజు కాశీబుగ్గలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్నాడు. మూడు రోజులుగా కళాశాలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. పరీక్షలు దగ్గర పడుతున్నా చదవడం లేదంటూ తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన యశ్వంత్‌రాజు ఇంటికి సమీపంలో ఉన్న జగనన్నకాలనీకి వెళ్లి నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ చేతిలో చాకు ఉండటం, మరో చేతిలో ఉరివేసుకున్న గుడ్డముక్క ఉండటంతో మధ్యలో బతకాలని ప్రయత్నం చేసినా బయటపడలేక చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. కుమారుడి మరణంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిమ్స్‌లో బీఎస్సీ పారామెడికల్ కోర్సులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలకు అనుబంధంగా బీఎస్సీ పారా మెడికల్ కోర్సులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు డిప్లొమా, పారామెడికల్ కోర్సులు మాత్రమే అందుబాటులో ఉండగా తాజాగా డిగ్రీ స్థాయిలో ఐదు విభాగాల కోర్సులు మంజూరయ్యాయి. 2007లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రిమ్స్ వైద్య కళాశాలను మంజూరు చేయగా తర్వాత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. ఫలితంగా వైద్య కళాశాలకు అనుబంధంగా ఉండాల్సిన నర్సింగ్, పారా మెడికల్ కోర్సులు మంజూరు అవ్వలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో బాధ్యతలు స్వీకరించాకే పారామెడికల్ కోర్సులు, నర్సింగ్ కోర్సులు మంజూరయ్యాయి. ఈ క్రమంలోనే డిగ్రీ స్థాయిలో పారామెడికల్ కోర్సులు మంజూరవుతాయన్న సమయంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పెండింగ్‌లో ఉండిపోయాయి. తాజాగా ఐదు కోర్సులతో 50 సీట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఎనస్తీషియా అండ్ ఓటీ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడిసన్ టెక్నీషియన్, ఇమేజింగ్ టెక్నిక్స్, ఆప్తాలమిక్ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నాలజీ వంటి కోర్సులు ఉన్నాయి. ప్రతిభ ఆధారంగా మార్చి నెలాఖరులోగా సీట్లను భర్తీ చేస్తారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

టెక్కలి రూరల్: టెక్కలి పట్టణంలోని సంతోషి మాత గుడి సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బూరగాం గ్రామానికి చెందిన భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బూరగాం గ్రామానికి చెందిన రవీంద్రరెడ్డి తన భార్య జయలక్ష్మి, తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై టెక్కలి వచ్చారు. అనంతరం ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ద్విచక్ర వాహనం హ్యాండిల్‌కి తగలడంతో అదుపుతప్పి బోల్తాపడ్డారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న భార్యాభర్తలకు గాయాలు కాగా, బాలుడికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. గాయపడినవారిని స్థానికులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- పట్టాలపై అకస్మాత్తుగా ఆగిన న్యూ జల్పాయిగుడి – చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రైలు
- ఆందోళనకు గురైన ప్రయాణికులు



మొరాయించిన రైలు ఇంజిన్ ఇదే

భువనేశ్వర్: రైలు ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. పట్టాలపై దూసుకెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అకస్మాతుగా పట్టాలపై ఆగిపోయింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని రైల్వే శాఖ ప్రకటించింది. 22861 న్యూ జల్పాయిగుడి – చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం మధ్యాహ్నం 2.45 గంటలకు బాలాసోర్ జిల్లా ఖరగ్‌పూర్ మండలం సొరొ, మార్కోనా ప్రాంతాల మధ్య ఇంజిన్ సమస్య కారణంగా ముందుకు కదల్లేక ఒక్కసారిగా నిలిచిపోయింది. ట్రాక్‌పై గుర్తు తెలియని వస్తువు అడ్డుగా నిలిచిపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఇంజిను మొరాయించడంతో ప్రత్యామ్నాయ ఇంజిన్ ఏర్పాటు చేసి సుమారు ఐదు గంటలు అనంతరం రైలు నడిపారు. ఈ ఘటనతో రైళ్ల రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. 12245 హౌరా – ఎస్ఎంవీటీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలుని సొరొ – మార్కోనా మధ్య నియంత్రించారు. 68051 బాలాసోర్ – భద్రక్ మెమూ రైలుని సొరొ వద్ద తాత్కాలికంగా నిలిపివేశారు. 18045 షాలిమార్ – హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును బాలాసోర్, 20889 హౌరా – తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలును రుప్సా రైల్వే స్టేషనులో నియంత్రించారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు



స్వాధీనం చేసుకున్న స్టౌ, సామాన్లు



నిందితుడు నిఖిల్ అఖోజీ



దొంగ సామగ్రిని కొనుగోలు చేసిన బి.శ్రీరాం

జయపురం: జయపురం పారాబెడలోని ఓ ఇంటిలో జరిగిన దొంగనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసు అధికారి శనివారం తెలిపారు. అరెస్టయిన వారిలో జయపురం కుంధారిగుడ స్వీపర్ కాలనీకి చెందిన నిఖిల్ అఖోజీ, స్థానిక విడి కళాశాల పరిసరాలకు చెందిన బి.శ్రీరాం ఉన్నారన్నారు. తన గ్యాస్ స్టౌ, సామాన్లు పోయినట్లు పారాబెడ నివాసి గౌరవ ఖాత్రీ ఈ నెల 20వ తేదీన ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. దర్యాప్తులో విశ్వాసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారం ప్రకారం నిఖిల్ అఖోజి ఇంటిపై దాడి జరిపి అతడిని అదుపులోనికి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించాడని.. అతడితోపాటు స్నేహితుడైన దేబ ఉన్నట్లు పేర్కొన్నారు. నిఖిల్ ఇంటిలో గ్యాస్ సౌను, సామాన్లను స్క్రేప్ దుకాణంలో స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. సామగ్రిని కొనుగోలు చేసిన బి.శ్రీరాంను కూడా అరెస్టు చేశామన్నారు. నిఖిల్ అఖోజి స్నేహితుడు దేబ పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- మరొకరి పరిస్థితి విషమం



వెంకినాయుడి మృతదేహం



చికిత్స పొందుతున్న రమణమ్మ



లారీ ఢీకొనడంతో బోల్తాపడిన ట్రాక్టర్

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బైరి-కరజాడ జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రూరల్ ఎస్‌ఐ రాము తెలిపిన వివరాల మేరకు.. ప్రతిరోజులాగే జాతీయ రహదారి రోడ్డు పనుల క్లీనింగ్ నిమిత్తం నర్సాపురం అగ్రహారం గ్రామానికి చెందిన 12 మంది వెళ్లారు. వీరంతా స్థానికంగా ఉన్నటువంటి కాంట్రాక్టర్ వద్ద వీరంతా కూలీలుగా పనిచేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం మడపాం టోల్‌గేటు వద్ద భోజనాలు చేసి, తిరిగి పనిలోకి ట్రాక్టర్ మీదుగా జాతీయ రహదారి పనులు చేస్తున్న బైరి ఫ్లైఓవర్ వద్దకు వెళ్లిపోయారు. అనంతరం అక్కడ ట్రాక్టర్ దిగుతుండగా నరసన్నపేట నుంచి విశాఖపట్నం మీదుగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పిన్నింటి వెంకినాయుడు(38) అక్కడికక్కడే మృతి చెందాడు. లింగాల రమణమ్మ అనే మహిళ తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రాణాలతో కొట్టిమిట్టాడుతోంది. ప్రస్తుతం ఈమె పరిస్థితి కుడా విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. అత్యవసర చికిత్స నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఏఆర్ సిబ్బంది మాక్ ఆపరేషన్



పరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ సిబ్బంది మాక్ ఆపరేషన్

విజయనగరం క్రైమ్: సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగినపుడు సకాలంలో వాటిని అదుపు చేసి పరిస్థితులను అదుపులోకి తెచ్చేది ఆర్మర్డ్ రిజర్వు పోలీసు. ఏఆర్ సిబ్బంది శిక్షణ తరగతులను ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శనివారం ఆయన ప్రారంభించారు. పోలీసు శాఖలో వెపన్స్ పట్టే ఏఆర్ సిబ్బందికి నిర్వహించాల్సిన విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ గోపాలనాయుడు, రమేష్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



పట్టుబడిన మద్యం సీసాల వివరాలను వెల్లడిస్తున్న సీఐ

గజపతినగరం రూరల్: బొండపల్లి మండలం రాచకిండాం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోనికి తీసుకొని మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జె.జనార్దనరావు శనివారం తెలిపారు. నిందితుడు నుంచి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. అక్రమంగా బెల్టు షాపులను గ్రామాల్లో నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో ఎస్ఐ సి.నరేంద్రకుమార్, హెచ్‌సీలు జె.బాషా, లోకాభిరామ్, సిబ్బంది రాజు గంగాధరుడు, వి.అప్పారావు, ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యా యత్నం

సీతానగరం: మండలంలోని గెడ్డలుప్పి గ్రామానికి చెందిన వ్యక్తి శనివారం తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే... గెడ్డలుప్పి గ్రామానికి చెందిన సోంగల కృష్ణమూర్తి కడుపు నొప్పి తట్టుకోలేక అనారోగ్యానికి గురయ్యాడు. నొప్పులు తట్టుకోలేక ఇంట్లో వ్యవసాయ క్రిముల నివారణ మందును తాగాడు. కృష్ణమూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్లినట్టు గుర్తించిన కుటుంబీకులు 108 వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

గడ్డి మందు తాగిన వ్యక్తికి అస్వస్థత

పార్వతీపురం టౌన్: గడ్డి మందు తాగిన వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సీతానగరం మండలం గెడ్డలుప్పి గ్రామానికి చెందిన చొంగళ కృష్ణమూర్తి భార్య బంగారమ్మ తెలిపిన వివరాల మేరకు కృష్ణమూర్తి చాలా కాలంగా మెడ, రెండు భుజాల నొప్పితో బాధ పడుతున్నాడు. గత మూడు రోజులుగా నొప్పిని భరించలేక చనిపోవాలని నిర్ణయం తీసుకుని గడ్డి మందు తాగాడు. దీంతో కొద్ది సేపటికే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్టు ఏఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

పుష్పాలంకరణలో శ్రీనివాసుడు



పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి

విజయనగరం టౌన్: నగరంలోని టీటీ డీ కళ్యాణ మండపం ఆవరణలో కొలువైన శ్రీనివాసుడు పుష్పాలంకరణలో శ నివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆ లయ ప్రధాన అర్చకుడు పీవీ.నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు.

విద్యుత్ శాఖకు.. బకాయిల గుదిబండ!

విద్యుత్ శాఖకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రూ.కోట్లలో మొండి బకాయిలు వసూలు కావాల్సి ఉంది. సామాన్యులు ఒక నెల విద్యుత్ బిల్లు చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేసే ఆ శాఖాధికారులు రూ.కోట్లలో బకాయి పడిన ప్రభుత్వ శాఖల జోలికి వెళ్లలేరు. ఎందుకంటే అవి ప్రభుత్వ శాఖలు. దీంతో రూ.కోట్ల మొండి బకాయిలు విద్యుత్ శాఖకు గుది బండగా మారాయి.

- రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు
- ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన మొత్తం రూ.57.51కోట్లు
- అత్యధికంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నుంచి రూ.34.84 కోట్ల బకాయి
- వైద్య ఆరోగ్య శాఖ బకాయిలు రూ.5.55 కోట్లు
- మున్సిపల్ శాఖ బకాయి రూ.6.76 కోట్లు



విద్యుత్ భవన్

ప్రభుత్వ శాఖల వారీగా చెల్లించాల్సిన బకాయిల వివరాలు

ప్రభుత్వ శాఖ	చెల్లించాల్సిన బకాయి
వైద్య ఆరోగ్య శాఖ	రూ.5.55 కోట్లు
విద్యా శాఖ	రూ.0.26 కోట్లు
హోం శాఖ	రూ.0.08 కోట్లు
సెంట్రల్ గవర్నమెంట్ అండర్ టేకింగ్స్	రూ.1.33 కోట్లు
మున్సిపల్, అడ్మిన్, అర్బన్ డెవలప్‌మెంట్	రూ.0.34 కోట్లు
పంచాయతీరాజ్	రూ.0.69 కోట్లు
రెవెన్యూ	రూ.4.20 కోట్లు
ఆర్‌డబ్ల్యూఎస్	రూ.34.84కోట్లు
వైటీసీ	రూ.3.46 కోట్లు
మున్సిపల్ కార్పొరేషన్స్	రూ.5.61 కోట్లు
మున్సిపాల్టీలు	రూ.1.75 కోట్లు

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ శాఖకు మొండి బకాయిలు గుదిబండగా మారాయి. వివిధ ప్రభుత్వ శాఖలు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇది ఆ శాఖకు గుది బండగా తయారైంది. బకాయిలు చెల్లించాలని విద్యుత్ శాఖ అధికారులు ఆయా శాఖలకు ప్రతి నెలా లేఖలు రాయడం తప్ప బకాయిలు వసూలు కావడం లేదు. ప్రభుత్వ శాఖల నుంచి విద్యుత్ శాఖకు అధికంగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఏదైనా గృహ వినియోగదారు బిల్లు చెల్లించడం నాలుగైదు రోజులు ఆలస్యమైతే విద్యుత్ సిబ్బంది వారి ఫ్యూజులు కట్ చేస్తారు. కానీ రూ.కోట్ల బకాయిలున్న వాటిని వసూలు చేయడంలో అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ శాఖల నుంచి రూ.57.51 కోట్లు బకాయి

జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల నుంచి విద్యుత్ శాఖకు రూ.57.51 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇందులో అత్యధికంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వారు రూ.34.84 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా వైద్య ఆరోగ్యశాఖ వారు రూ.5.55 కోట్లు, మున్సిపల్ శాఖ రూ.6.76 కోట్లు చెల్లించాల్సి ఉంది. రెవెన్యూ శాఖ రూ.4.20 కోట్లు చెల్లించాల్సి ఉంది.

లేఖలు రాస్తాం..

విద్యుత్ శాఖకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి బకాయిలు పెద్ద మొత్తంలో ఉన్నాయి. వీటికి సంబంధించి ఆయా శాఖలకు లేఖలు రాస్తాం. వారికి బడ్జెట్ వచ్చినపుడు బకాయిలు చెల్లిస్తుంటారు.
– ముప్పల లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

ఏసీబీ అధికారినంటూ బెదిరింపు ఫోన్ కాల్స్..!

- రైతు ఆత్మహత్యా యత్నం పేరిట బ్లాక్‌మెయిల్
- రూ.2లక్షలు ఇవ్వాలని వీఆర్‌ఓకు డిమాండ్

నెల్లిమర్ల రూరల్: తన భూమిని రిజిస్ట్రేషన్ చేయడం లేదని, వీఆర్‌ఓ గోవింద డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని ఆరోపిస్తూ ఇటీవల నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద చనమల్లుపేటకు చెందిన రైతు అబద్ధం ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. రైతు ఆరోపణపై విచారణ చేపట్టాలని ఇప్పటికే కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్డీఓకు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ ఘటనను ఆసరాగా తీసుకున్న గుర్తు తెలియని ఓ నకిలీ ఏసీబీ అధికారి సదరు వీఆర్‌ఓ గోవిందకు శనివారం బెదిరింపు కాల్స్ చేశాడు. తాను ఏసీబీ కార్యాలయం నుంచి డీఎస్పీని మాట్లాడుతున్నానని, రైతు ఆత్మహత్యా ప్రయత్నం ఘటనపై ఆదివారం సాయంత్రంలోగా అరెస్ట్ చేస్తామంటూ బెదిరించాడు. పెళ్లి అయ్యిందా.. పిల్లలున్నారా... వంటి ప్రశ్నలతో హడలెత్తించాడు. రైతు శనివారం కూడా పాయిజన్ తాగేందుకు ప్రయత్నించాడని వీఆర్‌ఓకు చెప్పి భయపెట్టాడు. వీఆర్‌ఓ భార్యతో కూడా మాట్లాడి ధైర్యంగా ఉండాలని చెప్పాడు. పాపకు ఆరోగ్యం బాగోలేదని చెప్పిన తరువాత, భయపడాల్సిన అవసరం లేదని సీఐ ఇంటికి వచ్చి కోర్టులో ప్రవేశపెడతారని చెప్పాడు. చివరిగా.. ఎవరికీ విషయం చెప్పొద్దని, ఈ అంశంలో తహసీల్దార్‌ను బుక్ చేద్దామని, నిన్ను తప్పిస్తా రూ.2లక్షలు ఇవ్వగలవా? అని డబ్బులు డిమాండ్ చేశాడు. తాను అప్పుల్లో ఉన్నానని, డబ్బులు ఇవ్వలేనని వీఆర్‌ఓ చెప్పగా.. సరే ఏదో చేద్దామంటూ కట్ చేశాడు. కొద్దిసేపటి తరువాత ఈఓపీఆర్‌డీ శంకర్ జగన్నాథంకు కూడా అదే వ్యక్తి ఫోన్ చేసి బెదిరించాడు. తహసీల్దార్, ఎంపీడీఓల ఫోన్ నంబర్లు ఇవ్వాలని అడిగాడు. కార్యాలయ అడ్రస్ వివరాలు చెబితే అక్కడికి వచ్చి చెబుతానని ఈఓపీఆర్‌డీ బదులివ్వగా సదరు నకిలీ అధికారి కాల్ కట్ చేశాడు. కాగా ఇద్దరికీ 81054 28257 ఫోన్ నంబరు నుంచే కాల్ వచ్చింది. కాగా ఏసీబీ నకిలీ డీఎస్పీ ఫోన్ కాల్స్‌తో అధికార వర్గాల్లో చర్చ సాగింది.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడు, వాచ్‌మేన్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. పాఠశాలలో పని చేస్తున్న ఓ సబ్జెక్టు ఉపాధ్యాయుడు విద్యార్థినిలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఓ విద్యార్థిని కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారని తెలిపారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న వాచ్‌మేన్‌పై కూడా ఇలాంటి ఆరోపణలతో ఫిర్యాదు అందడంతో అతనిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పాఠశాలకు వెళ్లి వివరాలు సేకరించామన్నారు.

వృద్ధులపై చిన్నచూపు వద్దు

- సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: వృద్ధులపట్ల చిన్నచూపు తగదని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. రాజాం పట్టణ పరిధి కొండంపేటలోని అనాథ వృద్ధాశ్రమాన్ని ఆమె శనివారం సందర్శించారు. వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలు, అందుతున్న సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ఉండి నిరాదరణకు గురైన వారి వివరాలు తెలియజేయాలన్నారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలదేనని అన్నారు. అనంతరం ఆశ్రమం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పి.శ్రీనివాస్, ఎస్.పోలారావు, కె.సాయిప్రశాంత్‌కుమార్, పి.చైతన్యకుమార్, ఎం.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



సంగీత కళాశాలలో అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం టౌన్: నగరంలోని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలను ఎస్పీ వకుల్ జిందల్ శనివారం మధ్యాహ్నం సందర్శించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో ఉన్న పోలింగ్ గదులను పరిశీలించారు. లైట్లు, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని పోలీస్, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. పరిశీలనలో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్‌బీ సీఐ ఏవీ లీలారావు, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్సైలు రామగణేష్, రవి, కళాశాల సూపర్‌వైజర్ ప్రసాద్, డీటీ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డు ధ్వంసం

బొండపల్లి: మండలంలోని గొల్లలపేట గ్రామంలో జిరాయితీ భూమిలో నిర్మించుకున్న రేకుల షెడ్డును పొక్లయినర్‌తో కూల్చివేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పీతల గుర్రయ్యకు చెందిన రేకుల షెడ్డు అదే గ్రామానికి చెందిన పీతల రాము కూల్చివేసినట్టు బాధిత కుటుంబ సభ్యులు వీఆర్‌ఓ కె.ప్రభాకరరావు దృష్టికి తీసుకువెళ్లారు. జిరాయితీలో రేకుల షెడ్డు ఉన్నందున తామేమి చేయలేమని పోలీసులకు ఆశ్రయించాలని ఆయన సూచించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ యు.మహేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన బైక్



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందు భాగం

గజపతినగరం: గజపతినగరం రైల్వేస్టేషన్ సమీపంలో జాతీయ రహదారి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. గజపతినగరం నుంచి మదుపాడ వెళ్తున్న మోటార్ సైకిల్ మానాపురం నుంచి గజపతినగరం వైపు వస్తున్న కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న మదుపాడ గ్రామానికి చెందిన గోపి, రవి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వైద్యం కోసం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

అంగన్‌వాడీల్లో మౌలిక వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వారంరోజుల్లోగా మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్‌వాడీల పనితీరుపై శనివారం సమీక్షించారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. ఫోర్టిఫైడ్ రైస్ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేసి రక్తహీనత నివారణకు కృషిచేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాల్లో వెనుకంజలో ఉన్న ఐదుగురు సీడీపీఓలకు చార్జ్ మెమోలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖ అధికారి టి.కనకదుర్గ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, సీడీపీఒలు, సూపర్ వైజర్లు, పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



అధికారులకు సూచనలు అందిస్తున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో మండలస్థాయి అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దన్నానపేట, రామతీర్థం ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలను అక్రమంగా తొలగించారని సర్పంచ్‌లు గేదెల రామచిరంజీవి, కంచరాపు సూర్యకళ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండల రెవెన్యూ సర్వేయర్ అందుబాటులో ఉండడం లేదని, ఫోన్‌కు కూడా స్పందించడం లేదని, దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్‌లు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా అభివృద్ధి పనులు కొనసాగుతుండడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో రైతుల రిజిస్ట్రేషన్లు పూర్తిస్థాయిలో జరిగేటట్లు చూడాలన్నారు. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ, జీబీఎస్ వ్యాధుల పట్ల ప్రజల్లో ఆందోళన నెలకొందని, వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించాలని సూచించారు.

టమాటా పంటను కొనుగోలు చేస్తాం..

- ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్



టమాటా సాగు చేస్తున్న రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన, మార్కెటింగ్ శాఖాధికారులు

బొబ్బిలి: టమాటా తదితర కూరగాయల పంటలను రైతులు కోసే ముందు సమాచారమిస్తే తాము వచ్చి రైతుబజార్లలో ఉన్న ధరలకే కొనుగోలు చేస్తామని బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈశ్వరరావు, ఉద్యాన శాఖాధికారి మోహనకృష్ణ అన్నారు. ఈ నెల 19న సాక్షి ప్రధాన సంచికలో రైతు కష్టం..పశువుల పాలు అన్న శీర్షికన ప్రచురితమయిన కథనానికి ఇరు శాఖల అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా బొబ్బిలి, రామభద్రపురం, తెర్లాం, బాడంగి మండలాల్లో టమాటా, కూరగాయలు పండిస్తున్న రైతుల పొలాలను వారు సందర్శించారు. రైతులకు అవసరమయిన సూచనలు చేశారు. గిట్టుబాటు ధరల కోసం ముందుగా తమను సంప్రదించాలని, కచ్చితంగా రైతుబజార్ల ధరలకు కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. రైతులు కూడా ఒకేసారి ఎక్కువ విస్తీర్ణంలో పంటను సాగు చేయకుండా 15 రోజుల చొప్పున వ్యవధి తీసుకుని సాగు చేయడం వలన ఉత్పత్తులకు డిమాండ్ కొనసాగుతుందన్నారు. రైతులు సంఘాలుగా ఏర్పడితే పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు సోలార్ శీతల గిడ్డంగులు, కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసుకునేందుకు 75 శాతం రాయితీతో మంజూరు చేస్తామన్నారు. వీహెచ్‌ఏలు హైమావతి, అప్పలనాయుడు, ఆయా మండలాల రైతులు పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీతో ఎంఆర్ కళాశాల ఒప్పందం



యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి సమక్షంలో అవగాహన ఒప్పందం

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీతో పట్టణంలోని మహారాజా అటానమస్ కళాశాల అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. స్థానిక యూనివర్సిటీ ప్రాంగణంలో శనివారం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి సమక్షంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, ఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు మధ్య ఒప్పంద సంతకాలు జరిగాయి. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)–2020 ప్రకారం పరిశోధన, విజ్ఞాన మార్పిడి, నైపుణ్య మార్పిడి మరియు ఇంటర్న్‌షిప్‌లు, విద్య, విద్యార్థులు ఉద్యోగం పొందే విధంగా ఉపాధి నైపుణ్యాలు అందించే విధంగా ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని యూనివర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా, పరిపాలన విభాగాధికారి డాక్టర్ ఎన్‌వీఎస్ సూర్యనారాయణ, ఎంఆర్ కళాశాల ఎస్టాబ్లిష్మెంట్, అక్రిడేషన్ కన్వీనర్ డాక్టర్ పి.గణపతిరావు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల విజేత ఎస్.కోట



విజేత జట్టుకు నగదు, మెమెంటోను అందజేస్తున్న ఎమ్మెల్యే

- ఉత్కంఠభరితంగా సాగిన పోటీలు
- ఉమ్మడి జిల్లాల నుంచి పాల్గొన్న 9 జట్లు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామ సమీపంలో గల శారద మెటల్స్ అండ్ ఎల్లోయిస్ లిమిటెడ్ కర్మాగారం సహకారంతో జిల్లా వాలీబాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో భారత్ డిఫెన్స్ అకాడమి గ్రౌండ్‌లో జరుగుతున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో శృంగవరపుకోట నియోజకవర్గం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. రెండు రోజులుగా సాగుతున్న ఈ పోటీల్లో ఫైనల్ మ్యాచ్ శనివారం జరిగింది. ఫైనల్‌లో పార్వతీపురం జట్టుపై ఎస్.కోట జట్టు విజయం సాధించింది. పార్వతీపురం, కురుపాం, విజయనగరం జట్లు వరుసగా ద్వితీయ, తృతీయ, నాల్గో స్థానాల్లో నిలిచాయి. ప్రథమ, ద్వితీయ విజేతలకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతుల మీదుగా వరుసగా రూ.1,25,000లు, రూ.60వేలు నగదు బహుమతితో పాటు మెమెంటోలు అందజేశారు. మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.30వేలు, 25వేలు చొప్పున నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. శారద కర్మాగార యాజమాన్యం క్రీడాభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం కర్మాగార ప్రతినిధులు సనత్‌కుమార్, ప్రభాత్‌మోహన్ మాట్లాడుతూ శారద కర్మాగారం సహకారంతో జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అందుకు తమ వంతు సహకారం పూర్తి స్థాయిలో అందజేస్తామన్నారు. పోటీలను జాతీయ వాలీబాల్ కోచ్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గవర సూరిబాబు, స్కూల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.కృష్ణంరాజు నిర్వహించారు. కార్యక్రమంలో భారత్ డిఫెన్స్ అకాడమి డైరెక్టర్ కడారి రాజు, శారద కర్మాగార ప్రతినిధులు అశోక్‌కుమార్, చౌదరి, మూర్తి, హెచ్.సన్యాసిరావు, జి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సెకీ విద్యుత్ ఒప్పందం సక్రమమే

- తేల్చిచెప్పిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి
- టీడీపీ, ఎల్లోమీడియా దుష్ప్రచారం బట్టబయలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: సెకీ విద్యుత్ ఒప్పందం సక్రమమేనని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి తేల్చి చెప్పిందని, ఇన్నాళ్లూ తాము చెప్పినవన్నీ అబద్ధాలు, కల్పిత కథనాలేనని కూటమి ప్రభుత్వం ఒప్పుకున్నట్లైందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. తన స్వగృహంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెకీతో గత ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందంలో అదానీ రూ.1,750 కోట్లు లంచం ఇచ్చారని, అంతర్జాతీయ స్థాయికి అవినీతిని చేర్చారని, పేరుకే సెకీ.. ఒప్పందం అదానీతోనేనని, ఐఎస్టీఎస్ చార్జీలు కట్టాల్సిందే అంటూ ఎల్లోమీడియా చేసిన దుష్ప్రచారం బట్టబయలైందన్నారు.

సంపద సృష్టించినదెవరు?

సెకీ నుంచి కారుచౌకగా విద్యుత్ కొనుగోలు వల్ల అప్పటి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏడాదికి రూ.4,400 కోట్లు చొప్పున ప్రజాధనాన్ని ఆదాచేసిందన్నారు. అదే చంద్రబాబు హయాంలో 2014–19 మధ్య విద్యుత్ యూనిట్ సగటున రూ.5.90 చొప్పున కొనుగోలు ఒప్పందాలు (పీపీఏలు) చేసుకున్నారన్నారు. సెకీ నుంచి కొనుగోలు చేసిన దానికంటే యూనిట్ రూ.3.41 అధికంగా కొనుగోలుచేసి ప్రజాధనాన్ని దుబారా చేశారన్నారు. 25 ఏళ్లకు రూ.1.10 లక్షల కోట్లను ఆదాచేసి సంపద సృష్టించిన వై.ఎస్.జగన్ గొప్పా..? లేక రూ.87,500 కోట్లు ఖజానాపై భారం వేసి సంపదను ఆవిరి చేసిన చంద్రబాబు గొప్పా? అని ప్రశ్నించారు. 2019–2023 మధ్య జగన్ ప్రభుత్వం 2 లక్షలపైగా వ్యవసాయ డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసిందన్నారు. చంద్రబాబు గత ఐదేళ్ల పాలనలో 3.5 లక్షల వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేస్తే.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సుమారు 5 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చి సాగుకు చేదోడువాదోడుగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో 9 గంటలు వ్యవసాయానికి పగటిపూట విద్యుత్ సరఫరా చేసేలా 6,663 ఫీడర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు రూ.1,700 కోట్లు వెచ్చించారన్నారు.

పట్టుదలతో చదివి అధిక మార్కులు సాధించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: పదోతరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి అధిక మార్కులు సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. పార్వతీపురంపట్టణంలోని మున్సిపల్ డీవీఎంఎం ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల చదువు, భవిత ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు భవితకు పదోతరగతి, ఇంటర్మీడియట్ కీలకమన్నారు. కష్టపడే స్వభావానికి సరైన వ్యూహాలు తోడైతేనే సానుకూల ఫలితాలు వస్తాయని గ్రహించాలని, ఆ దిశగా మీ మేధస్సుకు పదునుపెట్టాలని హితవు పలికారు. అనంతరం చర్చి వీధిలోని వార్డు విజ్ఞాన కేంద్రాన్ని తనిఖీచేశారు. గ్రూప్ 2, ఇతర పోటీ పరీక్షలకు సాధనచేస్తున్న యువతీ, యువకులతో మాట్లాడారు. వసతులపై ఆరా తీశారు. అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా విద్యా ప్రమాణాలు ఉన్నతీకరించుకోవడానికి నిరంతర శ్రమ అలవర్చుకోవాలన్నారు. నిరుద్యోగులకు ఉపయోగపడేలా వివిధ ఉద్యోగ ప్రకటనలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతి నాయుడు, మండల విద్యాధికారి వై.విమల కుమారి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.